

# పోచంపల్లి చేనేత వస్త్రాలు అత్యద్భుతం

2

**ఎక్స్పీరియన్స్ పోచంపల్లిలో మిస్ ఆసియా రేష్మి ఠాకూర్**




www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

ఆదివారం | 09 | ఆగస్టు | 2026 | పేజీలు: 08




# భూ దందా... రీ ఎంట్రీ?

## చంద్రుగొండలో మళ్లీ అక్రమ వెంచర్ల జోరు?

- హైవే పక్కనే ప్లాట్ల విక్రయాలపై ఆరోపణలు..?
- 1/70 చట్టం వర్తింపుపై అనుమానాలు
- గతంలో నిలిపివేసిన పనులు మళ్లీ ఎలా మొదలయ్యాయి?
- అధికారుల మౌనంపై స్థానికుల ప్రశ్నలు

భద్రాద్రి కొత్తగూడెం / అక్షిత బ్యూరో : భూదందా రీ ఎంట్రీ అయ్యింది. అనుమతులు లేకుండానే యదేచ్ఛగా విక్రయాల జోరందుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలో వెంచర్ల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. చంద్రుగొండ, కొత్తగూడెం జాతీయ రహదారి పక్కన, పెట్రోల్ బంక్ సమీపంలోని భూముల్లో మళ్లీ వెంచర్ పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. భూములను ప్లాట్లుగా విభజించి విక్రయాలకు సిద్ధం చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అయితే ఆయా భూములకు లేఅవుట్ అనుమతులు ఉన్నాయా? భూమి స్వభావం ఏమిటి? 1/70 చట్టం పరిధిలోకి వస్తుందా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**గతంలో చర్యలు.. మళ్లీ అదే పరిస్థితి**

ఇదే ప్రాంతంలో వెంచర్ పనులపై గతంలో కూడా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఈ వ్యవహారంపై వార్తా కథనాలు వెలువడిన నేపథ్యంలో అధికారులు స్పందించి వెంచర్ హద్దులను తొలగించి పనులను నిలిపివేసినట్లు సమాచారం. దీంతో అక్రమ వెంచర్లకు అడ్డుకట్ట పడిందని స్థానికులు భావించారు. అయితే కొద్ది నెలలు గడవకముందే మళ్లీ అదే ప్రాంతంలో పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు రావడం ..మిగతా 2లో



# ప్రభుత్వ ధాన్యం పక్కదారి!

**సీఎంఆర్ ముసుగులో భారీగా ధాన్యం గల్లంతు!**

**మిల్లు యజమాని అరెస్ట్...**

**బీఎన్ఎస్,ఈసీ యాక్ట్ కింద కేసు నమోదు...**



**లోకేశ్వరం, అక్షిత న్యూస్:** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) పేరుతో భారీ అక్రమం వెలుగు చూసింది. సాత్‌గాంలోని 'గజానన్ ఇండస్ట్రీస్' మిల్లు నుంచి ప్రభుత్వానికి చెందాల్సిన ఏకంగా 2,025 మెట్రిక్ టన్నుల ధాన్యం ..మిగతా 2లో

# కష్టపడ్డోళ్ళకు భవిష్యత్తు

**రైతులకు వెన్నంటి ఉండాలి**

**సొసైటీల టర్నోవర్‌ను పెంచేందుకు చైర్మన్లు కృషి చేయాలి**

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ లుగా నియమితులైన వారితో పాటు పాలకవర్గం సభ్యులుగా ఎంపికైన డైరెక్టర్లు రైతు శ్రేయస్సు కోసం పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. శనివారం షాద్ నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ..మిగతా 2లో



## కష్టపడ్డోళ్ళకు భవిష్యత్తు



**మొదటి పేజీ తరువాయి...**

మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ కార్యకర్తలకు భవిష్యత్తు ఉంటుందని సూచించారు. షాద్ నగర్ డివిజన్ లో మొత్తం ఆరు సహకార సంఘాలు ఉండగా అందులో ఐదు సహకార సంఘాలకు నూతన చైర్మన్ లను నియమించడం జరిగిందని తెలిపారు. రైతు శ్రేయస్సు కోసం ప్రభుత్వం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువస్తుందని, వాటిని పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత సహకార సంఘం పాలక వర్గాలపై ఉంటుందని సూచించారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, యంత్ర పరికరాలను రైతులకు అందించాల్సిన బాధ్యత సహకార సంఘం సభ్యులపై ఉంటుందని వివరించారు. పాలకవర్గం సభ్యులు బాధ్యతగా వ్యవహరించి ప్రభుత్వ రాయితీలను రైతులకు అందే విధంగా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని అన్నారు. సొసైటీలు రైతుల కోసం పనిచేయాలని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు అండగా ఉంటూ సంక్షేమం, అభివృద్ధి పథకాలను అందిస్తూ అండగా నిలిచిందని వివరించారు. ఒక రైతు బిడ్డగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని, రైతులు పడుతున్న కష్టాలను చూసి అనేక పథకాలను సబ్సిడీపై తీసుకువస్తున్నారని గుర్తు చేశారు. నిజాయితీ, నికాసైన కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అవకాశాలను అందిస్తుందని వివరించారు. భవిష్యత్తులో మరెన్నో అవకాశాలు వస్తాయని, కష్టపడ్డ కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని గుర్తు చేశారు. పదవులు పొందిన నాయకులు అంకిత భావంతో పనిచేసి ప్రజలు, రైతుల మన్ననలు పొందాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేయడంతో పాటు ఆర్థికపరంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత పాలకవర్గం సభ్యులపై ఎంతైనా ఉందని అన్నారు. పార్టీలో పదవులు రాని కార్యకర్తలకు భవిష్యత్తులో మంచి అవకాశాలు వచ్చే ఆస్కారం ఉంటుందని వివరించారు.

**ఐదు సహకార సంఘాల చైర్మన్లు వీరే**

షాద్ నగర్ నియోజక వర్గంలోని ఐదు సహకార సంఘాలకు నూతన చైర్మన్ లను, పాలకవర్గం సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొందరు మండల సహకార సంఘం చైర్మన్ గా తుమ్మలపల్లి జితేందర్ రెడ్డి, నందిగామ మండల పరిధిలోని చేగూరు సహకార సంఘం చైర్మన్గా పసుల బుచ్చయ్య, మేక గూడా సహకార సంఘం చైర్మన్ గా అంబటి ప్రభాకర్, నందిగామ సహకార సంఘం చైర్మన్ గా కుందారం వెంకటరెడ్డి, కేశంపేట సహకార సంఘం చైర్మన్ గా యేన్నశీ శ్రీధర్ రెడ్డిలతోపాటు ఐదు మంది వైస్ చైర్మన్లు, 78 మంది డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో పాటు కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి లు నూతన పాలకవర్గ నేతలు డైరెక్టర్లను సన్మానించారు.

## ప్రభుత్వ ధాన్యం పక్కదారి!



**మొదటి పేజీ తరువాయి...**

మాయమైనట్లు పౌరసరఫరాల శాఖ తనిఖీల్లో వెల్లడైంది. ప్రభుత్వ సరుకును పక్కదారి పట్టించారనే ఫిర్యాదు మేరకు లోకేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో మిల్లు యజమాని బడోల్ల సంజీవ్ (45)ను అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎల్. ప్రదీప్ తెలిపారు. నిందితుడిపై భారతీయ న్యాయ సంహిత (దీచీూ) సెక్షన్లు 316(2), 316(5), 318(3)లతో పాటు అత్యవసర వస్తువుల చట్టం సెక్షన్ 7 కింద కేసు నమోదు చేసి,కోర్టు రిమాండ్కు తరలించారు. ఈ అక్రమంలో మరికొందరి ప్రమేయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# భూ దందా...రీ ఎంట్రీ?

**మొదటి పేజీ తరువాయి...**



అధికారుల చర్యలపై ప్రశ్నలు తలెత్తేలా చేస్తోంది. గతంలో నిలిపివేసిన పనులు మళ్లీ ఎలా ప్రారంభ మయ్యాయి? అనుమతులు మంజూర య్యాయా? లేక అధికారుల ఆదేశాలను పక్కన పెట్టి పనులు కొనసాగుతున్నాయా? అన్నది తేలాల్సి ఉంది.

**రహదారులు.. ప్లాట్ నంబర్లు..విద్యుత్ స్తంభాల స్థలాలు.!**

స్థానికుల ఆరోపణల ప్రకారం.. వెంచర్ ప్రాంతంలో భారీగా మట్టిని తరలించి అంతర్గత రహదారులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్లాట్లను గుర్తిస్తూ నంబర్లు కేటాయించడం, విద్యుత్ స్తంభాల కోసం స్థలాలను ఏర్పాటు చేయడం వంటి పనులు కూడా జరుగుతున్నాయని చెబుతున్నారు. ఒకవైపు ప్లాట్ల అభివృద్ధి పనులు బహిరంగంగా జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు ఎందుకు స్పందించడం లేదన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఒకవేళ ఈ వెంచర్కు అన్ని అనుమతులు ఉంటే వాటిని అధికారులు స్పష్టం చేయాలని, అనుమతులు లేకుండా పనులు జరుగుతున్నట్లయితే తక్షణమే నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

**1/70 చట్టం వర్తిస్తుందా?**

చంద్రుగొండ ప్రాంతంలోని కొన్ని భూములకు గిరిజన భూముల బదలాయింపు నిబంధనలు వర్తిస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత భూముల రికార్డులను పరిశీలించి 1/70 చట్టం వర్తిస్తుందా? భూమి బదలాయింపులు నిబంధనలకు అనుగుణంగా జరిగాయా? అన్న అంశాలను అధికారులు నిర్ధారించాల్సిన అవసరం ఉంది. చట్టపరమైన అనుమతులు, భూమి యాజమాన్య హక్కులు, లేఅవుట్ అనుమతులు తదితర అంశాలను పరిశీలించకుండా ప్లాట్ల కొనుగోళ్లకు ప్రజలు ముందుకు వెళ్లకూడదని స్థానికులు సూచిస్తున్నారు.

**అమాయకుల జీవితకాల పొదుపే లక్ష్యమా?**

వెంచర్లలో ప్లాట్లను కొనుగోలు చేసేది ఎక్కువగా సామాన్య ప్రజలే. జీవితకాలం కష్టపడి కూడబెట్టిన డబ్బుతో సొంతింటి స్థలం కొనుగోలు చేయాలనే ఆశతో పలువురు ప్లాట్లను కొనుగోలు చేస్తుంటారు. అయితే అనుమతులు లేని లేదా వివాదాస్పద భూముల్లో ప్లాట్లు కొనుగోలు చేస్తే భవిష్యత్తులో రిజిస్ట్రేషన్, నిర్మాణ అనుమతులు, బ్యాంకు రుణాలు, యాజమాన్య హక్కుల విషయంలో సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. దీంతో అమాయక ప్రజల జీవితకాల పొదుపు ప్రమాదంలో పడకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**కోట్ల వ్యాపారం.. అధికారుల దృష్టికి రాకపోవడమేంటి?**

హైవే పక్కన భూములకు భారీగా డిమాండ్ ఉండటంతో వెంచర్ల ద్వారా కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ఇంత పెద్ద స్థాయిలో భూములను చదును చేయడం, రహదారులు ఏర్పాటు చేయడం, ప్లాట్లుగా విభజించడం జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారుల దృష్టికి రాకపోవడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో చర్యలు తీసుకున్న అధికారులు ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదు? అనే ప్రశ్న కూడా స్థానికంగా వినిపిస్తోంది. సమగ్ర విచారణకు డిమాండ్ వెంచర్కు సంబంధించిన భూముల రికార్డులు, లేఅవుట్ అనుమతులు, భూమి మార్పిడి వివరాలు, రహదారి అనుమతులు తదితర అంశాలపై సంబంధిత శాఖలు సమగ్రంగా విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, అనుమతులు లేని ప్లాట్ల విక్రయాలను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాస్తవాల ను ప్రజలకు వెల్లడిస్తారా? లేక గతంలో మాదిరిగానే చర్యలు తాత్కాలికంగానే పరిమితం అవుతాయా? అన్నది వేచి చూడాల్సిందే.

# పోచంపల్లి చేనేత వస్త్రాలు అత్యద్భుతం

## ఎక్స్పీరియన్స్ పోచంపల్లిలో మిస్ ఆసియా రేష్మి ఠాకూర్



**యాదాద్రి భువనగిరి/ అక్షిత బ్యూరో:** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పైలెట్ ప్రాజెక్టుగా " ఎక్స్పీరియన్స్ పోచంపల్లి" కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దీనిలో మిస్ ఆసియా రేష్మి ఠాకూర్ , మల్టీ నేషనల్ కంపెనీల ఉన్నత స్థాయి అధికారులు , ఫ్రాన్స్ క్యాన్సులేట్ ప్రతినిధులు, వివిధ సాంఘిక మాధ్యమాల ప్రతినిధులు పాల్గొన్నారు ఇందులో భాగంగా పోచంపల్లి గ్రామంలోని టూరిజం పార్క్ నందు సందర్శకులను సాంప్రదాయ బద్ధంగా ఇక్కత్ దారం మాలతో తిలక ధారణతో స్వాగతం పలకడం జరిగింది. తదుపరి వారిని బృందాలుగా విభజించి స్థానిక గైడ్స్ ద్వారా ఇక్కత్ వస్త్రాల చరిత్ర , ఫ్రేమ్ మగ్గాలు, గుంత మగ్గాలను పరిచయం చేస్తూ



వారికి పోచంపల్లి ఇక్కత్ వస్త్రాల తయారీ ( నూలు నుండి వస్త్రాలు వరకు) గురించి వివరించడం, తర్వాత నేత కార్మికుల ఇండ్లకి తీసుకెళ్లి పోచంపల్లి వస్త్రాల తయారీ విధానాన్ని వారి జీవన స్థితిగతులను వివరించడం జరిగింది. తరువాత సందర్శకులకు తెలంగాణ సాంప్రదాయ భోజనం ఏర్పాటు చేయడం జరిగింది తర్వాత వారు శివారెడ్డి గూడెం గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి అక్కడ వ్యవసాయ కూలీలతో ఆటపాటల కార్యక్రమాల్లో పాల్గొన్నారు మొత్తంగా ఈరోజు వచ్చిన సందర్శకులు ఈ పోచంపల్లి గ్రామ సందర్శన ఇక్కడి వస్త్రాల తయారీ విధానం ఇక్కడ భోజన విధానాలు ఇక్కడ సాంప్రదాయాలను ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా తిలకిస్తూ హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమం మొత్తాన్ని ఏ శ్రీనివాసరావు సహాయ సంచారకులు చేనేత మరియు జౌళి శాఖ యాదాద్రి , వారి సిబ్బంది, టూరిజం కన్సల్టెన్సీ ప్రతినిధి సాహితీ, ఎన్ఐయుఎం ప్రతినిధి నిత్య పర్యవేక్షించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశం సహకార సంఘం అధ్యక్షులు భారత లవ కుమార్ మరియు పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# తూప్రాన్ పేట ఎంజేపీటీలో ఘనంగా బోనాల జాతర

### తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బోనాలు...

### ఎంజేపీటీ బాలుర పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ బి.శిరీషా రెడ్డి



**చౌటుప్పల్/ అక్షిత న్యూస్:** తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బోనాలు అని ఎంజేపీటీ బాలుర పాఠశాల,కళాశాల ప్రిన్సిపల్ బి శిరీష రెడ్డి అన్నారు. చౌటుప్పల్,తూప్రాన్ పేట గ్రామ పరిధిలోని ఎంజేపీటీ బాలుర పాఠశాల,కళాశాలలో శనివారం ప్రిన్సిపల్ బి శిరీష రెడ్డి ఆధ్వర్యంలో బోనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పోతురాజు,పులి వేషధా రణ లలో పాల్గొని తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించారు. డప్పుల



మోతలు, పోతురాజు విన్యాసాలు, అమ్మవారి ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళా ఉపాధ్యాయులు నెత్తిన బోనాలతో పాఠశాల ఆవరణలో ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ఈ వేడుకలతో పాఠశాల ఆవరణంలో పండగ వాతావరణం నెలకొన్నది. విద్యార్థుల పోతురాజు విన్యాసాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

#### తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బోనాలు : ప్రిన్సిపల్ బి.శిరీష రెడ్డి

ఆషాఢమాసం తెలంగాణ ప్రజల సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన మాసమని ప్రిన్సిపాల్ అన్నారు. కొత్తకుండలో అన్నం,పాలు, బెల్లంతో నైవేద్యం తయారుచేసి పసుపు,కుంకుమ,వేపాకులతో అలంకరించి అమ్మవారికి సమర్పించడం ఈ పండుగ ప్రత్యేకతని విద్యార్థులకు తెలిపారు. ఈ పండుగ భక్తి,సాంప్రదాయం,ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. పండుగలు సమాజం చరిత్రను, సంస్కృతిని, విశ్వాసాలను, జీవన విధానాన్ని తరతరాలకు అందించే సజీవ సాంప్రదాయాలు అని కొనియాడారు. తెలంగాణ సంస్కృతిని భావితారాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో పాఠశాలలో బోనాల వేడుకలు నిర్వహించినట్లు ప్రిన్సిపల్ బి శిరీష రెడ్డి తెలిపారు. మన సంస్కృతిని కాపాడుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏటీపీలు జి రవికుమార్, జి మహేందర్ రెడ్డి, పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

### తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

### మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి జ్యోతి సత్యం



**కొల్లాపూర్, అక్షిత ప్రతినిధి:** కొల్లాపూర్ శనివారం: ప్రపంచ తల్లిపాల వారోత్సవాల లో భాగంగా కొల్లాపూర్ నియోజకవర్గంలోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి జ్యోతి సత్యం, వైస్ చైర్మన్ షేక్ రహీం పాషా ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రెడ్డి జ్యోతి సత్యం మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం. శిశువు శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లిపాలు అత్యంత ఆవశ్యకం అని తెలిపారు. బిడ్డ జన్మించిన తొలి గంటలోనే తల్లి ముర్రుపాలు పట్టడం వల్ల బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. కనీసం ఆరు నెలల వయస్సు వచ్చే వరకు బిడ్డకు కేవలం తల్లిపాలను మాత్రమే ఇవ్వాలి. ఇతర ఆహారాలు లేదా నీరు కూడా ఇవ్వకూడదు అని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా సిబ్బంది, స్థానిక మహిళలు, గర్భిణులు, బాలింతలు పెద్ద సంఖ్యలో పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన పొందారు.

# పేద పిల్లలకు అండగా కోనేరు సంస్థ

### బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు నిరంతరం కృషి

### కోనేరు సంస్థ ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాస్ యాదవ్

**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పేద పిల్లల కోసం కోనేరు సంస్థ అండగా నిలుస్తూ వారి బంగారు భవిష్యత్తు తీర్చిదిద్దడం జరుగుతుందని కోనేరు సంస్థ ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు శనివారం ఐదు మంది బడిపెట్టి పిల్లలను వసతి గృహంలో చేర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం మారుమూల గ్రామాలలో నిరక్షరాశుల కుటుంబాలలో ఉన్న పిల్లలు డ్రాప్ అవుట్ కాకుండా కోనేరు సంస్థ గ్రామీణ ప్రాంతాలలో తిరుగుతూ ఏ పిల్లలు బడికి వెళ్తున్నారు. ఎవరెవరు వెళ్లడం లేదు. ఏ కారణాల వల్ల వెళ్లడం లేదు అనే విషయాలు తెలుసుకుంటూ బడి బయట ఉన్న ప్రతి పిల్లవాడిని బడిలో చేర్పించేందుకు ఎంతో కృషి చేస్తున్నారు. అందులో భాగంగా పెద్దకొత్తపల్లి మండలం మరికల్ గ్రామానికి చెందిన ఐదు మంది పిల్లల గుర్తించి వారికి తల్లిదండ్రులకు కౌన్సిల్ నిర్వహించి హాస్టల్ వసతి కల్పిస్తే బడికి పంపిస్తామని తల్లిదండ్రులు చెప్పడంతో కోనేరు సంస్థ ఏరియా కోఆర్డినేటర్ శ్రీనివాసులు కృషి



వల్ల ఐదు మంది పిల్లలను కల్వకుర్తిలో చేర్పించడం జరిగింది . పిల్లలకు విద్యతోపాటు భోజన వసతి ఉండే విధంగా సౌకర్యాలు కల్పించిన కోనేరు సంస్థ శ్రీనివాస్ కు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరభద్రు రావు, ఉపాధ్యాయ బృందం తదితరులున్నారు.

# జిల్లా ప్రధాన కార్యదర్శిగా భుజంగ్ రావు...

### లోకేశ్వరానికి గర్వకారణం!



**లోకేశ్వరం,ఆగస్టు 8 అక్షిత న్యూస్ :** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం అవర్గ గ్రామనికి చెందిన గ్రామ సర్పంచ్ భుజంగ్ రావు,సంఘం అధ్యక్షులు భుజంగరావు నూతనంగా నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శుక్రవారం నియమితులయ్యారు. ఈ నియామకంతో లోకేశ్వరం మండలానికి జిల్లా స్థాయిలో గుర్తింపు లభించిందని పలువురు అభిప్రాయపడ్డారు.

సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామ అభివృద్ధికి చేసిన సేవలు, ప్రజా సమస్యలపై ఆయన చూపిన చొరవను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా భుజంగరావు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భుజంగరావు గారికి మండల ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి గారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు...

# రేణుక ఎల్లమ్మ బోనాల ఉత్సవాలకు మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డికి ఆహ్వానం




**ఉప్పల్ అక్షిత ప్రతినిధి, ఆగస్టు 8 :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని పీర్జాదిగూడ డివిజన్ ప్రశాంత్ నగర్ కాలనీలో కొలువుదీరిన శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఆదివారం నిర్వహించనున్న బోనాల పండుగ ఉత్సవాలకు మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డిని నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా దేవాలయ నిర్వాహకులు, స్థానిక ప్రముఖులు మాజీ మేయర్ జక్కా వెంకట్ రెడ్డిని కలిసి బోనాల ఉత్సవాలకు హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరుతూ ప్రత్యేకంగా ఆహ్వానం అందజేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో పాశం వెంకట్ రెడ్డి, బుర్ర వెంకన్న, పాశం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోనాల పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు.

# ఆర్టిఐ మండల ఉపాధ్యక్షుడిగా సర్కంటి శ్రీనివాస్ రెడ్డి నియామకం



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండల సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఉపాధ్యక్షుడిగా దేవలమ్మ నాగారానికి చెందిన సుర్కంటి శ్రీనివాస్ రెడ్డిని సమాచార హక్కు కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేష్ శనివారం ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా ఆర్టిఐ మండల ఉపాధ్యక్షుడు సుర్కంటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన సమాచార హక్కు చట్టం కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం ,కమిటీ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ లకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. సమాచార హక్కు చట్ట సాధన కోసం కమిటీ లక్ష్యసాధన కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఆర్టిఐ మండల ఉపాధ్యక్షుడిగా సుర్కంటి శ్రీనివాస్ రెడ్డి నియామకం కావడంతో గ్రామస్తులు, స్నేహితులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## గ్రామసభల ద్వారానే గ్రామ అభివృద్ధి

### గడ్డంపల్లి సర్పంచ్ వెన్నెల శేఖర్



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** గ్రామసభలే గ్రామ అభివృద్ధి కి సోపానాలు అని, గ్రామ సభల ద్వారానే అభివృద్ధి పథం వైపు తీసుకెళ్తామని గ్రామ సర్పంచ్ వెన్నెల శేఖర్ సూచించారు తెలకపల్లి మండల పరిధిలోని గడ్డంపల్లి గ్రామంలో. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రామసభలో సర్పంచ్ వెన్నెల శేఖర్ మాట్లాడుతూ గ్రామంలోని మౌలిక వసతులు, అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం, త్రాగునీరు, వీధిలైట్లు మొదలగు అంశాల పైన చర్చల ద్వారానే పరిష్కరించుకోగలమని గ్రామసభలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. పారిశుధ్యం, త్రాగునీరు, వీధిలైట్లు,అత్యంత ప్రాధాన్యత అంశాలు అని తెలియజేశారు. ఈ అంశాల పై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శంకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, వార్డ్ సభ్యులు,గ్రామస్థాయి అధికారులు, గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమం కోసం పనిచేస్తా

### కొందుర్గ సింగిల్ విండో చైర్మన్ జితేందర్



**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** రైతు సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొందుర్గు సింగిల్ విండో చైర్మన్గా నియమితులైన తుమ్మలపల్లి జితేందర్ రెడ్డి తెలిపారు. శనివారం షాద్నగర్లో జరిగిన కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గా నియమితులైన జితేందర్ రెడ్డిని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో పాటు కేశంపేట్ మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు ఈ సందర్భంగా చైర్మన్గా నియమితులైన జితేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతుల కు చేయూతని అందించేందుకు ముందుంటానని తెలిపారు సమస్యల మధ్య ఉండే రైతులకు అందుబాటులో ఉంటూ వారి అభివృద్ధికి ముందుంటానని వెల్లడించారు ప్రభుత్వపరంగా రైతులకు అందాల్సిన పథకాలను కార్యక్రమాలను చేరువ చేస్తానని తెలిపారు తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు

## ఘనంగా ఝాన్సీ రాజేందర్ రెడ్డిల వివాహ వార్షికోత్సవ వేడుకలు



**రాయపర్తి అక్షిత ప్రతినిధి:** మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ--రాజేందర్ రెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ మహిళా సాధికారతకు ఝాన్సీ రెడ్డి చేస్తున్న కృషి ఆదర్శనీయమని, వారు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సరికొండ కృష్ణారెడ్డి, టీఎం కృష్ణమాచార్యులు,పూల్లూరి దామోదర్ గుప్తా,బొమ్మెర కళ్యాణ్ గౌడ్,రెంటాల గోవర్ధన్ రెడ్డి, ఐరెడ్డి ఎల్లా రెడ్డి,మాందాటి సుదర్శన్ రెడ్డి,ఇల్లందుల భగవాన్,కందికట్ల యాకయ్య,ఎండి అఫ్రోజ్ ఖాన్,కాంచనపల్లి వనజారాణి, చెవ్వ హేమలత-కాశీనాథం, తీగల సాయిలు, రాయిని యాకయ్య, ఓరుగంటి వెంకన్న,చిర్ర మల్లయ్య,డీజే శ్రీను,నరసింహుల రామ్మూర్తి,పీరని ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యాలే విద్యార్థి భవిష్యత్తుకు పునాది

**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఒరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు ఉన్నత విద్యే బలమైన పునాది అని విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి వారికి నాణ్యమైన విద్యతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించాల్సిన బాధ్యతను కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులు విద్యా ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగించేందుకు మార్గదర్శనం చేయాలనే ఉద్దేశంతో ఒరియంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించము అని అన్నారు. ముఖ్య అతిథి రిటైర్డ్ ఐఏఎస్ రాంపుల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ టెక్నికల్ స్కిల్స్ సమస్య పరిష్కార నైపుణ్యాలు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని పరిశోధనాత్మక దృక్పథంతో సమాజ సేవలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలనిఅన్నారు.




కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ విద్యార్థులను ఉద్యోగాలకే పరిమితం చేయకుండా పరిశోధన ఆవిష్కరణలు నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారిస్తే ప్రపంచ స్థాయిలో రాణించవచ్చని విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు శ్రీ చైతన్య కట్టుబడి ఉన్నది అని జాతీయ విద్యా విధానం-2020 లక్ష్యాలకు అనుగుణంగా నాణ్యమైన సాంకేతిక విద్య అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో పాటు సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.జె లక్ష్మి నారాయణ స్వాగతం పలుకుతూ విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దడంలో కళాశాల యాజమాన్యం కీలకమని పేరెంట్స్--టీచర్స్ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు క్రమశిక్షణతో పట్టుదలతో చదువుతూ తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ మల్లెంపాటి విద్య మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ ప్రొఫెషనల్ ప్రొఫైల్పై దృష్టి పెట్టాలని కమ్యూనికేషన్ స్కిల్స్ టెక్నికల్ స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థులు తరగతులకు క్రమం తప్పకుండా హాజరవుతూ కళాశాలలో అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల డీన్ డాక్టర్ వి సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థులకు కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా సదుపాయాలు ల్యాబొరేటరీలు వివిధ శిక్షణా కార్యక్రమాలు ప్లేస్మెంట్ అవకాశాలు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి కళాశాల ట్రెనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్ డిప్లొమా ఇంచార్జి కృష్ణ ప్రసాద్ వివిధ విభాగాల అధిపతులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది తల్లితండ్రులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలి

### బీజేపీ మండల అధ్యక్షుడు నూనె అనిల్



**రాయపర్తి అక్షిత ప్రతినిధి:** ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని బీజేపీ మండల అధ్యక్షుడు నూనె అనిల్ పిలుపునిచ్చారు. రాయపర్తి మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు నూనె అనిల్ అధ్యక్షతన 'హర్ ఘర్ తిరంగా అభియాన్' మండల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పల్లె కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతమాత విముక్తి కోసం లక్షలాది మంది దేశభక్తులు తమ ప్రాణాలను తృణప్రాయంగా బలిదానం చేశారని అన్నారు. ఆనాటి స్వాతంత్ర్య సమరయోధుల వీరోచిత పోరాట స్ఫూర్తిని రాబోయే తరాలకు అందించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ 'హర్ ఘర్ తిరంగా అభియాన్' కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు. ఈ నెల 10వ తేదీన ప్రతి మండల కేంద్రంలో జాతీయ జెండా ఆవిష్కరణ, ప్రతి ఇంటికి జాతీయ జెండాలు అందించి వాటిని ఇళ్లపై ఎగురవేసే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే 11 నుంచి 14వ తేదీ వరకు మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విద్యార్థులు, ఎన్జీవోలు, యువజన సంఘాలతో కలిసి భారీగా తిరంగా ర్యాలీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని తిరంగా ర్యాలీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు వడ్లకొండ రవి, జిల్లా నాయకులు గడ్డం నరేందర్, కృష్ణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మల అనిల్, ఘటికలు ఉపసర్పంచ్ చిర్ర నాగరాజు, యువ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి పెండ్యాల గణేష్, యువ మోర్చా మండల అధ్యక్షులు మంచాల సుమన్ యాదవ్, యువ మోర్చా నాయకులు జక్కుల సందీప్, రాకేష్, శివ, నేత్ర, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు డా.ర్యాకల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు

### పలుచోట్ల అన్నదానాలు,ప్రత్యేక పూజలు



**యాదాద్రి భువనగిరి/అక్షిత బ్యూరో:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం తాజ్పూర్ గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకులు, సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన జన్మదిన వేడుకల్లో జిల్లా ప్రముఖ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు హాజరై శాలువా కప్పి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని పలువురు ఆశీర్వదించారు. అతి చిన్న వయసులోనే జిల్లాలో మంచి పేరు సంపాదించుకొని సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తూ ఏ ఆపద వచ్చినా వారికి సహాయం చేస్తూ అండగా నిలబడుతున్నారని పలువురు అన్నారు. పలుచోట్ల అన్నదానాలు ప్రత్యేక పూజలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డా.ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ నా జన్మదినం సందర్భంగా నాకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్క పార్టీ నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అధ్యక్షులు జనగాం పాండు,ప్రధాన కార్యదర్శి నీలం ఓం ప్రకాష్ గౌడ, భువనగిరి మండల్ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు జక్కా రాఘవేందర్ రెడ్డి మాజీ జెడ్పిటిసి సుబ్బూరు బీరు మల్లయ్య, మాజీ ఎంపీపీ కేశవ పట్నం రమేష్, మాజీ సింగల్ విండో చైర్మన్ బల్గూరి మధుసూదన్ రెడ్డి, మాజీ జెడ్ పి టీ సి సందేల సుధాకర్, మదర్ డైరీ డైరెక్టర్ కస్తూరి పండు, టౌన్ పార్టీ అధ్యక్షులు ఏవి కిరణ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఏ ఆంజనేయులు, సర్పంచులు ఉప సర్పంచ్ లు వార్డు మెంబర్లు ఆర్ఎస్కే టీమ్ మెంబర్లు కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కె.ఎల్.ఐ పంపుల ప్రారంభం ముమ్మాటికి బిఆర్ఎస్ విజయం

**ఆంధ్రా ప్రయోజనాలు కాపాడడం కోసం రేవంత్ ఆరాటం**

**నిరంజన్ రెడ్డిని విమర్శించే నైతికత మేఘారెడ్డికి ఎక్కడిది?**

**విలేకరుల సమావేశంలో బిఆరెస్ నాయకులు**



**వనపర్తి అక్షిత ప్రతినిధి:** కె.ఎల్.ఐ పంపుల ప్రారంభం ముమ్మాటికి బి. ఆర్.ఎస్ విజయం అని, ఆంధ్రా ప్రయోజనాలు కాపాడడం కోసం రేవంత్ ఆరాట పడుతున్నాడని అన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగమైన ఎల్లూరు,జొన్నల భోగడ, గుడిపల్లి రిజర్వాయర్ల నుండి సాగు జలాలు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లాలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మేఘారెడ్డి అవగాహన రాహిత్యంతో ప్రకటనలు విడుదల చేస్తూ ప్రజలలో చులకన అవుతున్నారని ఆరోపించారు. నిరంజన్ రెడ్డికి ప్రాజెక్టుల మీద ,సాగు జలాల మీద అవగాహన లేదని ఎమ్మెల్యే మాట్లాడడం హాస్యాస్పదం అని అన్నారు. కె.సి.ఆర్ నిరంతరం రైతుల సంక్షేమం కోసం జూరాల ప్రాజెక్టులో నీటి లభ్యతను ముందే పసిగట్టి రియర్వాయర్లు నింపి పంటలు పండించి సస్యశామలం చేశారని కానీ నేటి ప్రభుత్వం ఆంధ్రా రాష్ట్ర ప్రయోజనాలు కాపాడడం కోసం ఉన్న సాగు జలాలు వినియోగించుకోవడంలో దారుణంగా విఫలమైందని విమర్శించారు. మహారాష్ట్ర,కర్ణాటక నుండి జూరాల ప్రాజెక్టుకు 2లక్షల 30వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుందని వరద నీటిని సద్వినియోగం చేసుకొని రిజర్వాయర్స్ నింపి వర్షాకాలం,యాసంగి పంటలకు సాగు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానివి తప్పుడు అవగాహన లేని ప్రకటనలు అని, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నార్లపూర్ రిజర్వాయర్ ముట్టడి చేస్తామని హెచ్చరించిన తర్వాత ఎల్లూరు, జొన్నల భోగడ గుడిపల్లి రిజర్వాయర్ లలో మూడు పంపులు ప్రారంభించామని ప్రకటించడం సిగ్గుచేటని అన్నారు. ఎల్.సీ.ఓ పేరిట కె.ఎల్.ఏ నుండి ఒక పంపు మాత్రమే ప్రారంభించి పంపులు ఆన్ చేశామనడం ప్రభుత్వ అవివేకం అని అన్నారు. నీళ్ల మీద, రైతుల మీద, వ్యవసాయం మీద బాధ్యత, మమకారం, సోయి లేని సన్నాసులకు సమాచారం కోసం నిన్న బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఈ నెల 11న నార్లాపూర్ ముట్టడిస్తామని హెచ్చరికలు చేసిన తరువాతే కాలువలకు నీళ్లు వదిలారని తెలిపారు. ఇప్పటికీ కూడా గుడిపల్లి రిజర్వాయర్ లో నీళ్లు ఎత్తిపోస్తున్నారు. కానీ కాలువలకు ఈ క్షణం వరకు వదల్లేదని అన్నారు. బీఆర్ఎస్ హెచ్చరికల తరువాతనే ఎల్లూరు, జొన్నలబొగుడ, గుడిపల్లిలలో మోటార్లు ఆన్ చేశారు. తాగునీటి కోసమే ఎల్లూరు, గుడిపల్లి, జొన్నలబొగుడ రిజర్వాయర్లు నింపేందుకు ప్రయత్నించారు. కానీ రైతులకు సాగునీరు ఇవ్వడానికి కాదు. ఇప్పటికి కూడా ఎక్కడా రైతులకు సాగునీరు విడుదల చేయడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి కేఎల్ఐ పరిధిలోని 500 చెరువులు, కుంటలు వెంటనే నింపాలి. రైతులకు సాగునీరు అందించాలని తెలిపారు. బీఆర్ఎస్ హెచ్చరికల నేపథ్యంలోనే ప్రభుత్వం పూర్తి స్థాయిలో మోటార్లు ఆన్ చేసింది. నిన్న సాయంత్రం వరకు ఎల్లూరు, జొన్నలబొగుడలలో నడిచింది ఒక్కటే మోటరు. ప్రస్తుతం కూడా జొన్నల బొగుడలో ఒక్కటే మోటారు నడుస్తుందని అన్నారు. గుడిపల్లిలో ఈ క్షణం వరకు నీళ్లు విడుదల చేయలేదు. బీఆర్ఎస్ హెచ్చరికలతో కాంగ్రెస్ నేతలు అబద్దాలు ప్రచారం చేస్తున్నారు. 2వందల రోజుల పాటు పంపులు నడిచే అవకాశం ఉన్నందున ఇప్పటికైనా వానకాలం యాసంగి పంటలకు సాగు నీళ్లు అందించాలని గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ నందిమల్ల.అశోక్ డిమాండ్ చేశారు. ఈ సమావేశములో కె.మాణిక్యం, గంధం. పరంజ్యోతి,ఉంగ్లం.తిరుమల్,ధర్మశాస్త్ర,మహేశ్వర్ రెడ్డి, జోహెబ్ హుస్సేన్, సయ్యద్.జమీల్, పాండు తదితరులు ఉన్నారు.

# ప్రాణ రక్షణలో సీపీఆర్‌దే కీలక పాత్ర

**కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో ఉద్యోగులకు సీపీఆర్ శిక్షణ**

**అత్యవసర వేళల్లో సీపీఆర్‌పై అవగాహన అవసరం: జీఎం వెంకటరమణ**



**భద్రాద్రి కొత్తగూడెం / అక్షిత బ్యూరో:** అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వ్యక్తికి సకాలంలో సీపీఆర్ అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ సీహెచ్ వెంకటరమణ అన్నారు.కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయంలో శనివారం జీఎం సీహెచ్. వెంకటరమణ ఆధ్వర్యంలో ఉద్యోగులకు సీపీఆర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు సీపీఆర్ ప్రాముఖ్యత, అత్యవసర సమయాల్లో బాధితులకు అందించాల్సిన ప్రాథమిక సహాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో తొలి కొన్ని నిమిషాలు ఎంతో కీలకమని, వైద్య సిబ్బంది చేరుకునేలోపు సరైన పద్ధతిలో సీపీఆర్ అందించడం ద్వారా బాధితుడి ప్రాణాలను నిలబెట్టే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఉద్యోగి సీపీఆర్‌పై ప్రాథమిక అవగాహనతో పాటు శిక్షణ పొందడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ముఖ్యంగా పని ప్రదేశాల్లో అకస్మాత్తుగా అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆలస్యం చేయకుండా స్పందించేలా ఈ శిక్షణ ఉపయోగపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వ్యక్తిని గుర్తించడం, స్పందన మరియు శ్వాసను పరిశీలించడం, అత్యవసర వైద్య సహాయం కోసం సమాచారం అందించడం, ఛాతీపై కంప్రెషన్స్ చేయడం, అవసరమైన సందర్భాల్లో ఎఇడి పరికరాన్ని వినియోగించడం వంటి అంశాలను వివరించారు.అనంతరం ఉద్యోగులతో ప్రాక్టికల్‌గా సీపీఆర్ చేయించి, సరైన విధానాన్ని ఇన్‌చార్జ్ ఎంఆర్ఎస్ అనంతరామయ్య వివరించారు.ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతకు సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని జీఎం పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు ప్రాథమిక సహాయం అందించే విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ వి. రామకృష్ణ, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, ఏరియా ఎస్టేట్స్ ఆఫీసర్ బి. తౌర్య, డీవైపీఎం హరీష్, సీనియర్ పీఓ మురళి, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, ఐఎన్‌టీయూసీ ఫిట్ సెక్రటరీ సీహెచ్. సాగర్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ కే. సౌజన్యతో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

## మూడునెలలుగా జీతాల్లేవ్..!

**అవస్థల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు**

**బకాయిలు చెల్లించాలి**

**జిల్లా కోశాధికారి దనే పోశెట్టి**



**లోకేశ్వరం, ఆగస్టు 8 (అక్షిత న్యూస్):** నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు గత మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు నిలిచిపోవడంతో కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, నిత్యావసరాల కొనుగోలు భారంగా మారిందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వం, ఉన్నతాధికారులను కోరారు. మూడు నెలలుగా జీతాలు అందక ఫీల్డ్ అసిస్టెంట్ల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని జిల్లా కోశాధికారి దనే పోశెట్టి పేర్కొన్నారు. బకాయిలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు...

## పీఆర్సీ నీ వెంటనే ప్రకటించాలి

**నల్ల బ్యాడ్జిలతో ఉపాధ్యాయుల నిరసనలు**




**ఇచ్చోడ అక్షిత న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ నీ వెంటనే ప్రకటించాలని ఉపాధ్యాయ సంఘాల నాయ కులు డిమాండ్ చేశారు. దీర్ఘ కాలికంగా పెండింగ్ లో ఉన్న ఆరు డీఏలను తక్షణమే విడుదల చేయాలని పేర్కొన్నారు. అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆవరణ లో శనివారం భోజన సమయంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (ఖుూాజ) ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసనలు చేశారు. 2023 జూలై

1 నుంచి రావలసిన పీఆర్సీని ప్రకటించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.హౌరిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా ప్రకటించకుండా జాప్యంలో పెట్టారని వారు తెలిపారు. ఆ మూడింటిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమం లో యూఎస్పీసీ నాయకులు శ్యాంసుందర్, రాజేందర్, మల్లేష్, లక్ష్మణ్, ప్రసాదరాజ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తకోటలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** వనపర్తి జిల్లా కొత్తకోట పట్ట ణంలోని విశ్వశాంతి విద్యాని కేతన్ పాఠశాలలో 2009 – 2010 లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా గురువులచే కేక్ కట్ చేయించారు. నాడు తమకు విద్యా, బుద్ధులు నేర్పి తమ ఉన్నతికి దోహదపడిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుందర్, ఆంజనేయులు, రాములు, శేఖర్, హఫీజ్, బిందురాణి, గుల్షాద్ బేగం, పావని, పూర్వ విద్యార్థులు విష్ణు, జయసింహ, శ్రీకాంత్, స్వాతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకం సమిష్టి బాధ్యత

**రాష్ట్ర కాంగ్రెస్ యువ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి**



**కాజీపేట్, అక్షిత ప్రతినిధి :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం సుబేదారి ఎస్ బి హెచ్ కాలనీలో వనమహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మె ల్యే నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు విష్ణువర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. కాలనీలో వీరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించు కోవాలన్నారు. ప్రతి ఒక్కరు మొక్కల పెంపకాన్ని బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. పర్యావరణ సమతుల్యతను కూడా కాపాడాల్సిన కర్తవ్యం మనందరిపై ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



## మక్తల్ నియోజకవర్గంలో మూడు పోలింగ్ కేంద్రాలు పెరగనున్నాయి

**జనాభా,ఓటర్ల సంఖ్య ప్రాతిపదికన చేపట్టిన పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌లో భాగంగా మక్తల్ నియోజకవర్గంలో మూడు పోలింగ్ కేంద్రాలు పెరగనున్నాయి..తహాశీల్దార్ సతీష్ కుమార్**



**నారాయణపేట,అక్షిత ప్రతినిధి:** జనాభా,ఓటర్ల సంఖ్య ప్రాతిపదికన చేపట్టిన పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌లో భాగంగా మక్తల్ నియోజకవర్గంలో మూడు పోలింగ్ కేంద్రాలు పెరగనున్నాయి.దీంతో ఇప్పటి వరకు ఉన్న 284 పోలింగ్ కేంద్రాల సంఖ్య 287కు చేరబోతుంది.మక్తల్ మండలంలో ఒకటి,ఉట్కూర్ మండలంలో రెండు కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.ఈ సందర్భంగా తహశీల్దార్ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం 1,200కు పైగా ఓటర్లు ఉన్న ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిందని,ఇందులో భాగంగానే ఉట్కూర్ మండలంలోని పెద్దజట్రం,కొల్లూరు,మక్తల్ మండలంలోని చందాపురం పంచాయతీల్లో ఓటర్ల సంఖ్య అధికంగా ఉండటంతో అదనపు పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించడం జరిగిందన్నారు.కొత్త పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన మ్యాపింగ్,నివేదిక తయారీ పూర్తయిందని,కలెక్టర్ ఆమోదం అనంతరం ఈ నెల 10లోపు రాష్ట్ర ఎన్నికల కార్యాలయానికి వివరాలను సమర్పించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.ఎన్నికల కమిషన్ ఆమోదం లభిస్తే వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో 287 పోలింగ్ కేంద్రాల ద్వారా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

## ఆదిలాబాద్‌లో ఆలయాల అభివృద్ధికి..

**రూ.14 కోట్ల నిధులు మంజూరు చేయాలి**

**టీటీడీకి ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ వినతి**



**ఇచ్చోడ, అక్షిత న్యూస్:** అదిలాబాద్ నియోజక వర్గం లో సుమారు 60 ఆలయాలు ఉన్నాయని, వీటి పరి రక్షణ కోసం ప్రత్యేకంగా రూ 14. కోట్ల నిధులు మంజూరు చేయాలని అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు. తిరుమలలో టీటీడీ బోర్డు సభ్య లు భాను ప్రసాద్ ను శనివారం మర్యాద పూర్వకంగా కలిసి, వినతి పత్రాన్ని అందజేశారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి, చారిత్రక దేవాలయాల పరిరక్షణకు సంబంధించిన పలు అంశా లపై ఎమ్మెల్యే చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని అనేక పురాతన ఆలయాలు సరైన అభి వృద్ధి, మౌలిక వసతుల కోసం ఎదురు చూస్తున్నా యని, వాటి అభివృద్ధి ద్వారా ఆధ్యాత్మికతతో పాటు స్థానిక వారసత్వాన్ని కాపాడు కోవచ్చని ఆయన స్పష్టం చేశారు. తెలిపారు.అదేవిధంగా ప్రత్యేక చారిత్రక, వారసత్వ ప్రాధాన్యత కలిగిన ఆలయాల పరిరక్షణకు ప్రత్యేక గ్రాంట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఆది లాబాద్‌లో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీనివాస కళ్యాణం నిర్వహించాలని కోరారు. దీనివల్ల ఆదిలాబాద్ ప్రజలకు శ్రీవారి వైభవాన్ని ప్రత్యక్షంగా వీక్షించే అవకా శం లభిస్తుందని తెలిపారు.ఎమ్మెల్యే చేసిన అభ్యర్థన ను టీటీడీ బోర్డు సభ్యులు భాను ప్రసాద్ సానుకూ లంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. నియోజక వర్గంలోని ఆలయాల అభివృద్ధి, చారిత్రక దేవాలయా ల పరిరక్షణకు అవసరమైన నిధులు సాధించేందుకు ప్రభుత్వం, టీటీడీతో నిరంతరం సమన్వయం చేస్తా మని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# ప్రజాపాలన స్ఫూర్తితో ‘తొండ’ గ్రామాభివృద్ధి..



**సర్పంచ్ భాషమల్ల స్వాతి భాస్కర్**

**ఎమ్మెల్యే మందుల సామేలు సహకారంతో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని వెల్లడి**

**పచ్చదనం, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఇంటింటికీ మొక్కల పంపిణీ**

**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన స్ఫూర్తితో, స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు ఆధ్వర్యంలో తొండ గ్రామ పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని గ్రామ సర్పంచ్ భాషమల్ల స్వాతి భాస్కర్ అన్నారు. తిరుమలగిరి మండలం తొండ గ్రామపంచాయతీ పరిధిలో ట్రాక్టర్ ద్వారా ప్రతి ఇంటికీ వివిధ రకాల మొక్కలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రజా రంజక పాలనలో భాగంగా గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ భారీ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. గ్రామంలో విరివిగా చెట్లు ఉండడం వల్ల ఆహ్లాదకర వాతావరణంతో పాటు ప్రజలకు మంచి ఆక్సిజన్ దొరుకుతుందని చెప్పారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు మరియు పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి కుటుంబం బాధ్యతగా కనీసం ఆరు మొక్కలు నాటి, వాటిని ప్రాణప్రదంగా సంరక్షించాలని ఆమె పిలుపునిచ్చారు. గ్రామంలో పచ్చదనాన్ని మరింత విస్తరించే లక్ష్యంతో ప్రతి ఇంటికీ పండ్ల, పూల మొక్కలతో పాటు వేప చెట్లు, ఇతర రకాల మొక్కలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి యాకూబ్ రెడ్డి, ఉప సర్పంచ్ గొలుసుల వెంకన్న, వార్డు మెంబర్స్ సంధ్య, సోమన్న, ప్రవంతి, నవీన్, వెంకటేష్ (బాలు), ఫీల్డ్ అసిస్టెంట్ గీత, డాక్టర్ సమతరాణి, ఏఎన్ఎం మాధవి, ఆశా వర్కర్స్ కలమ్మ, ఉమా, మంజుల మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అర్వపల్లిలో జైల్ భరో జయప్రదం చేయండి..

**కొలిశెట్టి యాదగిరిరావు**



**తిరుమలగిరి,అక్షిత ప్రతినిధి:** గత 12 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ బిజెపి ప్రభుత్వం రైతులు, గ్రామీణ పేద కూలీలు, కార్మికులు, శ్రామిక మహిళల ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ పేద ప్రజల నడ్డి విరుస్తుందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు విమర్శించారు. తొండ తిరుమలగిరి పూలే అంబేద్కర్ తెలంగాణ చౌరస్తాలో శనివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జైలుభరో కార్యక్రమం జయప్రదం చేయండి అని వాల్ పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాదగిరిరావు మాట్లాడుతూ రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, వ్యవసాయ రంగాన్ని నీరుగార్చే విధంగా ఉన్నటువంటి స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని ప్రజలంతా ముక్తకంఠంతో వ్యతిరేకించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల అక్రమంగా తీసుకువచ్చిన విత్తన చట్టాలను, రైతు వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే కార్మికుల హక్కులను కాలరాస్తూ యాజమాన్యాలకు బహుళ జాతి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని ఆయన కోరారు. కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తూ కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలని కోరారు. ప్రజల ఆహార భద్రతను, ప్రజలకు పని కల్పించి ఉపాధి అందించే బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకోవడానికి జిబి గ్రామ్ జి చట్టాన్ని తీసుకు వచ్చిందన్నారు. ఆ బాధ్యతను కేంద్రం రాష్ట్రాల పై తోసేసే కొట్రకు వడిగట్టిందని అన్నారు. కానీ పల్లెల్లో పేద ప్రజల ఉపాధి పని భద్రతను కాపాడడంలో భాగంగా వామపక్షాలు పోరాడి సాధించుకున్న గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.

జిబి గ్రామ్ జి చట్టాన్ని రద్దు చేసి ఉపాధి హామీ చట్టాన్ని మరింత పటిష్టంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దానిలో భాగంగానే జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి హైవే పై ఈనెల 10 తారీఖున అఖిలభారత రైతు సంఘం, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్ భరో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. అట్టి జైల్ భరో కార్యక్రమంలో ప్రజలు ప్రజాతంత్ర వాదులు రాజకీయాలకు అతీతంగా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి కడారి లింగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మట్టిపల్లి లక్ష్మి, వనం సోమయ్య, పడమటింటి నగేష్, సిఐటియు నాయకులు ఆనుగంటి శ్రీనివాస్, కొమ్ము సోమయ్య, సిపిఎం నాయకులు బుర్గుల ప్రభాకర్ పులిమామిడి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ అంతర్జాతీయ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

## ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక పిలుపు






**భద్రాచలం అక్షిత న్యూస్ :** భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో ఆగస్టు 9న నిర్వహించనున్న ఆదివాసీ అంతర్జాతీయ దినోత్సవంలి కార్యక్రమాలను జయప్రదం చేయాలని భద్రాచలం పట్టణ ఆదివాసీ ప్రజానీకానికి ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు పిలుపునిచ్చారు.

ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాలు, భాష, జీవన విధానం, అభివృద్ధి అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు, ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లేందుకు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం ఒక ముఖ్యమైన వేదికగా నిలుస్తుందని వారు తెలిపారు. ఆదివాసీ సమాజం ఐక్యతను చాటుతూ, తమ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.

**ర్యాలీ, నివాళులర్పణ కార్యక్రమాలు**

ఆగస్టు 9న ఉదయం 9 గంటలకు భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లోని ఆదివాసీ అమరవీరులు అల్లూరి సీతారామరాజు, ఘూం గంటన్న దొర, ఘూం మల్లు దొర విగ్రహాలకు నివాళులు అర్పించి, జెండా ఆవిష్కరణ, గీతాలాపన కార్యక్రమాలతో దినోత్సవ వేడుకలులి ప్రారంభమవుతాయని తెలిపారు.

అనంతరం లిఅక్కడి నుంచి బ్రిడ్జి సెంటర్ మీదుగా ర్యాలీగా బయలుదేరి, పాత మార్కెట్ సెంటర్‌లోని రాణి దుర్గావతి, కొమరం భీమ్ విగ్రహాలకు నివాళులు అర్పిస్తూ ఐటిడిఏ గిరిజన భవన్ వరకు ర్యాలీలి కొనసాగుతుందని వెల్లడించారు. అదే సందర్భంగా లిఐటిడిఏ రోడ్డుకు మాజీ ఎమ్మెల్యే ముర్ల ఎర్రయ్య రెడ్డి పేరు నామకరణంలి చేసి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

అనంతరం మధ్యాహ్నం 2 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, గిరిజన అభివృద్ధి అంశాలపై సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముఖ్య అతిథులు ఈ కార్యక్రమానికి లిభద్రాచలం ఎమ్మెల్యే శ్రీ తెల్లం వెంకట్రావు, టీఎస్ఎఫ్‌డీసీ చైర్మన్ పొదెం వీరయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ శ్రీ అంకిత్, ఎస్పీ శ్రీ రోహిత్ రాజ్, ఐటిడిఏ పీఓ శ్రీ రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, డీఎస్పీ అరుణ్ కుమార్, భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణలి ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారని తెలిపారు.

ఆదివాసీ సమాజానికి చెందిన ప్రజలు, యువత, మహిళలు, విద్యార్థులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆదివాసీ అంతర్జాతీయ దినోత్సవాన్ని ఘనంగా, విజయవంతంగా నిర్వహించాలని ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో లిఆదివాసీ సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ తెల్లం రమణయ్య, కో-కన్వీనర్ ముర్ల రమేష్ రెడ్డి, కుంజా ధర్మారావు, గుండు శరత్, పూనెం వీరభద్రం, జగ్గా పుల్లయ్య, ఇర్పా అనసూయ, వీసాల కృష్ణయ్య, కుంజా రమాదేవి, కొంద్రు సుధారాణి, వర్ష వసంత్, కొంద్రు వీరస్వామి, కుంజా సంతోష్, చింతా అరుణ, కణితి రాధ, గుండు చలపతి, నిట్టా రాజు, కంగాల రమణ కుమారి, కుంజా శ్రీను, శీలం దుర్గ, కుంజా బేబీ రాణి, మెస్రం వసంత్, ఉబ్బా వేణులి తదితరులు పాల్గొన్నారు.

# నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు..

## ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య



**నారాయణపేట,అక్షిత ప్రతినిధి:** నారాయణపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల తనిఖీలు నిర్వహించి నెంబర్ ప్లేట్ లేకుండా,నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వాహనదారులను గుర్తించి జరిమానాలు విధించారు.అలాగే వెంటనే నెంబర్ పెట్లు వేసుకోవాలని అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి వాహనానికి నిబంధనల ప్రకారం నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల వాహనాన్ని గుర్తించడం కష్టమవడంతో పాటు,నేరాలు జరిగిన సందర్భాల్లో దర్యాప్తుకు కూడా ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. వాహనదారులు తమ వాహనాలకు ప్రామాణికమైన నెంబర్ ప్లేట్లను తప్పనిసరిగా అమర్చుకోవాలని సూచించారు.నెంబర్ ప్లేట్‌ను వక్రీకరించడం,అక్షరాలు లేదా అంకెలను స్పష్టంగా కనిపించకుండా చేయడం,నెంబర్ ప్లేట్ స్థానంలో ఇతర రకాల ప్లేట్లు ఉపయోగించడం వంటి నిబంధనల ఉల్లంఘనలను సహించబోమని స్పష్టం చేశారు.ట్రాఫిక్ నిబంధనలు ప్రజల భద్రత కోసమే రూపొందించబడ్డాయని,ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించి నిబంధనలను పాటించాలని సూచించారు.వాహనం నడిపే సమయంలో డ్రైవింగ్ లైసెన్స్,వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు, ఇన్సూరెన్స్ తదితర పత్రాలు చెల్లుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు.అలాగే ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు మరియు ఇతర నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు.మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హెచ్చరించారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని,ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం కలిగించే అవకాశం ఉందని ఎస్ఐ కృష్ణ చైతన్య పేర్కొన్నారు.ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని,సురక్షితమైన ప్రయాణానికి బాధ్యతాయుతమైన వాహనదారులుగా వ్యవహరించాలని ఆయన కోరారు.

# 3వ వార్డు అధ్యక్షుడిగా బండమీది వెంకటేష్ నియామకం



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశానుసారం చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ మూడవ వార్డు లింగోజిగూడెం అధ్యక్షుడిగా బండమీది వెంకటేశం శనివారం ఎన్నికయ్యారు,ఈ సందర్భంగా చౌటుప్పల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేసి వారు మాట్లాడుతూ..పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయడంతో పాటు, వార్డు స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి అంకితభావంతో పనిచేయాలని వారు సూచించారు.

ఈ నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ బండమీది వెంకటేష్ కి శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చౌటుప్పల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేన రెడ్డి కి,చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి కి, కాంగ్రెస్ పార్టీ నాయకులకు బండమీది వెంకటేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# భువనగిరి సిద్ధార్థ ఐటిఐలో అడ్మిషన్లు ప్రారంభం

## ప్రిన్సిపాల్ కట్ట మోహన్ రెడ్డి

## క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదం పొందిన సిద్ధార్థ ఐటిఐ

## డైరెక్ట్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ సంస్థచే గుర్తింపు

## ఇప్పటికే సిద్ధార్థ ఐటిఐ నుంచి వేలాది మందికి ప్రభుత్వ ఉద్యోగాలు



**యాదాద్రి భువనగిరి అక్షిత న్యూస్:** నిరుద్యోగ యువతీ యువకులు ప్రభుత్వ ఉద్యోగాలలో రాణించాలని కోరుకుంటు న్నారా! అయితే వెంటనే భువనగిరిలోని సిద్ధార్థ ఐటిఐ కళాశాల లో చేరి మీ కోరికలను, కలలను సహకారం చేసుకోండి. యాదాద్రి భువనగిరి జిల్లా, భువనగిరి లోని సిద్ధార్థ కళాశాల కేంద్ర ప్రభుత్వ కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ గుర్తింపు కలిగి ( క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా), డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ సమస్థ చే గుర్తింపుగలిగిన సిద్ధార్థ ఐటిఐ లో మంచి ప్రమాణాలు, కళాశాలలో సరైన వర్క్ షాపులు, ప్రాక్టికల్ పరికరాలతో కలిగి ఉన్నాయి. భువనగిరి లోని సిద్ధార్థ ఐటిఐ లో రెండవ విడత అడ్మిషన్లు ప్రారంభమైనాయని ప్రిన్సిపల్ కట్ట మోహన్ రెడ్డి తెలిపారు. సిద్ధార్థ ఐటిఐ లో ఎలక్ట్రీషియన్( ఎస్ ఎస్ సి పాస్) రెండు సంవత్సరాల కోర్స్, ట్విట్టర్ ( ఎస్ ఎస్ సి పాస్ ) రెండు సంవత్సరాలు కోర్స్, మెకానిక్ డీజిల్ ( ఎస్ ఎస్ సి పాస్ ) ఒక సంవత్సరం కోర్సు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సిద్ధార్థ ఐటిఐ లో ప్రతి నెల మల్టీ నేషనల్ కంపెనీలతో జాబ్ మేళా అప్రెంటిషిప్ నిర్వహించడం జరుగుతుంద న్నారు. 2022- 23 సంవత్స రంలో జరిగిన విద్యుత్ జూనియర్ లైన్మెన్ పోస్టులలో యాదాద్రి భువనగిరి జిల్లాలో ఎక్కువమంది సిద్ధార్థ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు పొందారని మోహన్ రెడ్డి తెలిపారు. సిద్ధార్థ ఐటిఐ కళాశాల జిల్లాలోని అత్యధిక ఉత్తీర్ణత కలిగిన విద్యాసంస్థని తెలిపారు. సిద్ధార్థ ఐటిఐ కళాశాలలోని విద్యార్థులకు బస్ పాస్, రైల్వే పాస్ సౌకర్యంతో పాటు స్కాలర్షిప్ సౌకర్యం కూడా కలదని, విద్యార్థులు ఈనెల 8 నుంచి 15వ తేదీ లోపు అప్లై చేసుకోవాలని, 9848571409 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి తెలిపారు.

## బీసీల ఆత్మగౌరవం కోసం పండగ సాయన్న పోరాటం చిరస్మరణీయం

**బీసీ కులాల ఐక్య వేదిక కన్వీనర్ గౌనికాడి రాములు యాదవ్**



**వనపర్తి అక్షిత ప్రతినిధి:** బీసీల ఆత్మగౌరవం కోసం పండగ సాయన్న పోరాటం చిరస్మరణీయం అని, అణగారిన వర్గాల ఆత్మగౌరవం, సామాజిక సమానత్వం, ప్రజల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు పండగ సాయన్న అని బీసీ కులాల ఐక్య వేదిక కన్వీనర్ గౌనికాడి రాములు యాదవ్ అన్నారు. శనివారం వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణ కేంద్రంలో పండగ సాయన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గౌనికాడి రాములు యాదవ్ మాట్లాడుతూ పండగ సాయన్న జీవితం కేవలం ఒక వ్యక్తి చరిత్ర కాదని, అన్యాయాన్ని ఎదిరించి హక్కుల కోసం నిలబడే ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిచ్చే పోరాట చరిత్ర అని పేర్కొన్నారు.

పండగ సాయన్న బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం కోసం ధైర్యంగా పోరాడారని, సామాజిక అసమానతలు మరియు అణచివేతకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. బీసీలకు సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం, విద్య, ఉపాధి సమాన అవకాశాలు సాధించడమే పండగ సాయన్నకు అందించే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్త గంగాధర్ ముదిరాజ్, హోటల్ కురుమూర్తి, విజయ్ కుమార్, శివ శంకర్, భాస్కర్ నాయి బ్రాహ్మణ, ముదిరాజ్ సంఘం మండల పట్టణ నాయకులు బాలయ్య, చాపల భాస్కర్, సంద రంగస్వామి, రామ చంద్రయ్య, సిటీ కేబుల్ బాలు, పరుశురాం, సాయి, వెంకటేష్ యాదవ్, శేఖర్ యాదవ్, లావణ్య, కృష్ణయ్య, అమ్మపల్లి రాములు, నరసింహ, దారమోని బాలరాజు, దాసరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## బెంగుళూరులో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

**చేనేత రంగాన్ని ఆదుకోవాలి**

**జాజుల శ్రీనివాస్ గౌడ్**



**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:** కర్ణాటక రాజధాని బెంగుళూరులోని జ్ఞాన జ్యోతి ఆడిటోరియంలో 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఇక్కడ నిర్వహిస్తున్న 11వ ఓబీసీ జాతీయ మహాసభల వేదికగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు శ్రీ జాజుల శ్రీనివాస్ గౌడ్ గారు చేనేత వృత్తి ఆధారిత కళాకారులకు, పద్మశాలి సమాజానికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడటంలో చేనేత కళాకారుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. ప్రభుత్వాలు చేనేత రంగానికి మరిన్ని సబ్సిడీలు ఇస్తూ, వారి సంక్షేమానికి ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ మహాసభలో సూర్యాపేట జిల్లా తిరుమలగిరి చేనేత సహకార సంఘం అధ్యక్షులు వంగరి బ్రహ్మం గారు పాల్గొని స్థానిక చేనేత కార్మికుల సమస్యలను వేదిక దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, విద్యార్థి విభాగం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, జాతీయ యువజన విభాగం అధ్యక్షుడు శ్యామ్ కురుమ, జూబ్లీహిల్స్ ఇంచార్జ్ బండి గారి రాజు గౌడ్, బీసీ మహిళా నాయకురాలు సిద్ధాంతం శ్యామల పాల్గొన్నారు. అలాగే తిరుమలగిరి మండలం బీసీ సంక్షేమ సంఘం నాయకులు సుంకరి కిరణ్, ముద్దంగుల యాదగిరిలతో పాటు దేశవ్యాప్తంగా విచ్చేసిన వివిధ హోదాల్లోని బీసీ సంఘాల ముఖ్య నేతలు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేశారు.

# హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా కొండోజు అశోక్ చారి



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి: హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తుర్కలపల్లి గ్రామానికి చెందిన కొండోజు అశోక్ చారి బాధ్యతలు స్వీకరించారు. సంస్థ జాతీయ చైర్మన్ నందన్ నరసింహ రావు ఆదేశాల మేరకు అశోక్ చారిని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా నియమించారు.ఈ సందర్భంగా అశోక్ చారికి తుర్కలపల్లి గ్రామస్తులు,పలువురు సామాజిక, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు,మిత్రులు, శ్రేయోభిలాషులు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం,ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘనలకు గురవుతున్న బాధితులకు అండగా నిలిచి,వారికి న్యాయం జరిగేలా కృషి చేయడంతో పాటు, ప్రజలకు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలలు,పేదలు,అణగారిన వర్గాలు,నిరుపేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై సంస్థ తరఫున చట్టపరమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.అశోక్ చారి నాయకత్వంలో హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం కావాలని, ప్రతి జిల్లాలో సంస్థ కార్యకలాపాలను విస్తరించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆకాంక్షించారు. బాధితులకు న్యాయం అందించడం,ప్రజాస్వామ్య విలువలు, మానవ హక్కులు, సామాజిక సమానత్వం కోసం నిరంతరం పనిచేయాలని కోరారు.

ఈ సందర్భంగా అశోక్ చారి మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన జాతీయ చైర్మన్ నందన్ నరసింహ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ,మానవ హక్కుల పరిరక్షణ,బాధితులకు న్యాయం,ప్రజా సమస్యల పరిష్కారం,చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సంస్థను మరింత విస్తరించి ప్రజలకు సేవలందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## అభివృద్ధికి ఆమడ దూరంలో దళిత వాడలు

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు జల్లెల పెంటయ్య, కొండమడుగు నరసింహా**



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడిచిన అభివృద్ధికి ఆమడ దూరంలో దళితులు, దళిత వాడలు ఉన్నాయని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు జల్లెల పెంటయ్య, కొండమడుగు నర్సింహ్మాలు ఆవేదన వ్యక్తపరిచారు. శనివారం చౌటుప్పల మండల పరిధిలోని మసీదుగూడెం గ్రామంలో దళిత వాడలను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు.ఈ సందర్భంగా పెంటయ్య, నర్సింహాలు మాట్లాడుతూ.. గ్రామంలో దళిత కుటుంబాలు 25 ఉంటే కేవలం ఐదుగురికి మాత్రమే స్లాబ్ ఇండ్లు ఉన్నాయని మిగతా వారికి పెంకలు, రేకుల ఇండ్లు ఉండి ఇబ్బందులు పడుతున్నారని వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంకా ఐదు కుటుంబాలకు సెంటు భూమిలేదని మిగతా కుటుంబాలకు కూడా ఎకరంలోపు భూములు ఉన్నాయని వారందరికీ ప్రభుత్వం ఒక్కొక్కరికి 3 ఎకరాల భూమిని ఇవ్వాలని అన్నారు. దళితవాడలలో మురికి కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఉన్న మురికి కాలువలు కూడా అస్తవ్యస్తంగా ఉండి దోమల బెడదతో, వాసనతో ఆయా ఇండ్లలో ఉండలేకపోతున్నారని వివిధ జబ్బులకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా మురికి కాలువల నిర్మాణం చేపట్టాలని సూచించారు. నేటికీ విద్య , వైద్యం, ఉపాధి అందని ద్రాక్ష లాగే మిగిలిందని ప్రభుత్వం దళితులకు, నిరుపేదలకు ఉచిత విద్య , వైద్యం అందించాలని కోరారు. దళితులకు సంబంధించిన సబ్ ప్లాన్ నిధులను, ప్రత్యేక నిధులను కేటాయించి జిల్లా వ్యాప్తంగా అన్ని దళితవాడలను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు గంగాదేవి సైదులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు యాట బాలరాజు, చింతల సుదర్శన్, జిల్లా కమిటీ సభ్యులు మానే సాలయ్య, మండల కమిటీ సభ్యులు సంజీవ రమేష్ గ్రామ ప్రజలు చెక్క లింగస్వామి, రేణుక, శంకర్, నాగమ్మ , సురేష్, నాగలక్ష్మి, బక్క సురేష్, బాబు, సుజాత, రోనయ్య, యాదమ్మ , మల్లయ్య, అండాలు , పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పచ్చని భద్రాచలమే మా లక్ష్యం





**భద్రాచలం, అక్షిత న్యూస్:** భద్రాచలం పట్టణాన్ని పచ్చని వనంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రీన్ భద్రాద్రి--భద్రాచలం ఆధ్వర్యంలో చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు అభినందనీయమని భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ అన్నారు. పట్టణంలో పచ్చదనం పెంపొందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొక్కలు నాటడం, వాటి సంరక్షణకు కృషి చేయడం ప్రశంసనీయమన్నారు.

గ్రీన్ భద్రాద్రి--భద్రాచలం ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, గౌరవ అతిథిగా భద్రాచలం సర్పంచ్ పునేం కృష్ణదొర హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ భద్రాచలం వంటి పవిత్ర పుణ్యక్షేత్రాన్ని మరింత పచ్చదనంతో, ఆహ్లాదకరమైన వాతావరణంతో తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా స్వీకరించాలని అన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే విస్తృతంగా మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందని సర్పంచ్ పునేం కృష్ణదొర అన్నారు. గ్రీన్ భద్రాద్రి చేపడుతున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను అభినందిస్తూ ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి సెక్రటరీ రంజిత్ నాయక్, కోశాధికారి ఉప్పాడ రామ్ ప్రసాద్ రెడ్డి, పూర్వ అధ్యక్షులు డా. గోళ్ల భూపతిరావు, కామిశెట్టి కృష్ణార్జునరావు, డా. శివరామకృష్ణ, వీరయ్య, సంపత్, ఆలయ పూజారి విశ్వనాథం, కార్‌స్టాండ్ అధ్యక్షుడు, సభ్యులు పాల్గొన్నారు. వృక్ష ప్రేమికులు, గ్రీన్ భద్రాద్రి సభ్యులు, దాతలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. "వృక్షో రక్షతి రక్షితః" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రకృతిని ప్రేమిద్దాం.. మొక్కలను నాటుదాం.. భవిష్యత్ తరాలను కాపాడుదాం అని నిర్వాహకులు పిలుపునిచ్చారు.